షాక్ తగిలినట్లుగా మాటా పలుకూ లేకుండా బిగిసుకుపోయినట్లుగా ఉన్న రజిత వాళ్ళు వెళ్ళగానే అత్తయ్యా మీద విరుచుకు పడింది.

"ఈ ఇంట్లో వాళ్లకి అన్నీ తెలుసు.... పైకి ఏమీ తెలియనట్లుగా నాటకాలాడుతున్నారన్నమాట! ఇప్పటికి అసలు సంగతి బయటపడింది! బావ ప్రేమించటం.. అన్నీ అబద్ధాలే! డబ్బు కోసం ఈ సంబంధం కుదుర్చుకున్నారని తెలిసే అక్క తన ప్రాణం తీసుకుంది... ఆ ఉసురు ఊరికేపోదు..."

"రజితా.. ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా...?" అత్తయ్య స్వరం గర్జించినట్లే ఉంది.

"బాగానే తెలుస్తోంది! ఏమీ లేకపోయినా గానీ... సుజన మీద అందరూ ఈగ అయినా వాలనివ్వరేంటీ అనుకున్నాను! ఇప్పుడు తెలిసింది! అందుకే... మా అక్క చావుకి కారణం అని తెలిసినా ఆవిడకే ఖరీదైన నగలన్నీ ఇచ్చి... సొంత మేనకోడలకి మాత్రం మొక్కుబడిగా పనికిరానివి పడేశావ్..."

"రజితా... కొంచెం నోరు సంబాళించుకో... నీకు తెలియని విషయాల గురించి మాట్లాడకు...."

"ఇన్నాళ్ళు తెలియకుండానే దాచిపెట్టారు. తెలిసాక.. నాకింత అన్యాయం జరిగినా నేను మాట్లాడకుండా ఉండాలా..?"

"నీకు ... నీకేం అన్యాయం జరిగింది...?" అత్తయ్య ఆశ్చర్యంగా అడిగారు.

"నాకు మాయ మాటలు చెప్పి ఒప్పించి పెళ్ళి చేసి ఇక్కడ పడేశారు... చూస్తే ఇక్కడేం లేదు..."

"నిన్ను ఒప్పించారా..? చిన్న పిల్లవి... నీకీ సంగతులన్నీ తెలియటం ఎందుకని అని ఊరుకుంటే నీ ధోరణి మరీ మితిమీరిపోతోంది! మీ నాన్న... పరంధామయ్య నా చేతులు పట్టుకుని... 'వ్యాపారంలో బాగా దెబ్బతిని ఉన్నాను. పిల్లాడికి ఇవ్వటానికే ఏమీ లేదు...' అని ప్రాధేయపడితే నేనే పెళ్ళి ఖర్చులు.. నగలు.. అన్నీ భరించి మేనకోడలివని చేసుకుంటే... నీకు అన్యాయం జరిగిందని మాట్లాడుతున్నావ్...!"

రజితకు కాసేపటిలోనే ఇంకొక షాక్ తగిలినట్లు అయింది!

ఈ సంగతులన్నీ నా ముందే అత్తయ్య ప్రస్తావించటంతో రజితకు మరీ అవమానంగా ఉండి ఉంటుంది. అందుకే అగ్గి మీద గుగ్గిలంలా భగ్గుమన్నట్లుగా చూస్తూ "నాన్నను రానీయి... ఇదేమిటో తేల్చుకుంటాను... అందరివీ నాటకాలే..." అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

❋ ❀ ❋

ఆ రాత్రి విష్ణు బాగా పొద్దుపోయాక వచ్చారు.

తాతగారి ఆస్తిపాస్తుల వ్యవహారమంతా విష్ణుకీ చాలా విడ్డూరంగా ఉంది.

తనకీ విషయాలన్నీ ముందుగా చెప్పకపోవటంలో ఏదైనా కారణం ఉందా అనడిగారు. తాతగారితో నాన్నగారికి వచ్చిన భేదాభిప్రాయాలు, అమ్మ మరణం... క్లుప్తంగా చెప్పి, తన సంపాదనతోనే నన్ను పెంచి పెద్ద జేయాలనే నాన్నగారి అభిప్రాయం... తాతగారి ఆస్తిపాస్తులనే అర్హత లేకుండానే అత్తవారింట్లో అందరి ఆదరాభిమానాలను పొందాలనే నా కోరిక గురించీ చెప్పాను.

"ఇక వేరే చోట లోను కోసం ప్రయత్నించాల్సిన పని లేదుగా" అనగానే విష్ణు తల అడ్డంగా ఊపారు.." మీ నాన్నగారే ఆ డబ్బును ఉపయోగించుకోవాలనుకోలేదు. అప్పుగానైనా సరే... నాకూ ఇష్టం లేదు. వేరే విధంగా నా ప్రయత్నం నాకు ఉంది..." అన్నారు. నేనేదో చెప్పబోతుంటే ఆ టాపిక్ వద్దన్నట్లుగా చేయి చూపించేసరికి... నేనూ మాట్లాడలేదు. నిట్టూర్చి ఊరుకొన్నాను.

నన్ను ఒక క్షణం తదేకంగా పరికించినట్లుగా చూసి "నువ్వు అందమైన, వ్యక్తిత్వం కల అమ్మాయివనే అనుకున్నాను... ఒక అద్భుతంలా కనిపిస్తున్నావు.." అన్నారు.

చిరునవ్వుతో "చిన్న సవరణ... నేను ఒక అద్భుతమైన వ్యక్తి కూతుర్ని మాత్రమే...!" అన్నాను.

నిజం అన్నట్లుగా తల ఊపి, "మామగారి ద్వారా సంక్రమించిన అంత ఆస్తి ఉండీ, మీ నాన్నగారు అలా సాధారణ జీవితాన్ని గడపటం... నిజంగా గొప్ప సంగతే..!" అన్నారు.

నాన్నగారి వ్యక్తిత్వ ప్రభావం నా మీదా ఉంది. పుస్తక పఠనం, నిరాడంబరత, సేవాభిలాష... ఇవి నాన్నగారి దగ్గర్నుండి కొంచెంగా నాకూ అలవడినాయనుకుంటాను.

ప్రస్తుతానికి అన్నీ లాకర్‌లో ఉంచి, ఏం చేయాలనేది నాన్నగారితోనూ చర్చించి ఒక నిర్ణయానికి రావచ్చని ఇద్దరం అనుకున్నాం.

మేం ఆలోచించవలసిన అవసరం లేకుండా... పయనించవలసిన మార్గం ముందే నిర్దేశించబడి ఉందనే సంగతి కొన్నాళ్ళకే తెలిసింది!

❊ ❀ ❊

ఆ మరునాడే కోదండం గారు వచ్చారు.

అందరూ కూర్చున్నప్పుడు రజితను కొంచెం గట్టిగానే మందలించారు. రజితను పెంచుకున్న తర్వాత పరంధామయ్యగారికి కొడుకు పుట్టాడు. అందుకని వ్యాపారంలో దెబ్బతిన్నామనే సాకుతో రజితకు ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వకపోయినా కోదండంగారు కించిత్తు కూడా బాధపడలేదట. కానీ ఇప్పుడు... పిల్లను గారాబంగా పెంచారే గానీ కొంచెమైనా క్రమశిక్షణ అలవర్చకుండా, పెద్దలతో ఎలా మాట్లాడాలనే మాటతీరును, వినయాన్నీ నేర్పించనందుకు మాత్రం చాలా బాధగా ఉందన్నారు... ఇప్పుడైనా గట్టిగా మందలిస్తూ రజితను దారిలో పెట్టాల్సిన బాధ్యత అత్తయ్యదేనంటూ, నన్ను చూసైనా ప్రవర్తన సరిదిద్దుకోమని రజితకు సలహా ఇచ్చారు.

ఆశ్చర్యంగా రజిత కోపం తెచ్చుకోకుండా, ప్రశంసావాక్యాల్ని వింటున్నట్లుగా ముసి ముసిగా నవ్వుకుంటూ, ఎటో చూస్తూ కూర్చుంది.

కోదండంగారు రజితను నిజంగానే కోప్పడుతున్నారో.. లౌక్యాన్ని చూపిస్తున్నారో అర్థం కాలేదు. చివరగా ఆయన "మేనకోడలివి... నీకు అన్యాయం జరిగితే మీ అత్తయ్య ఊరుకుంటుందా? అన్నీ మీ అత్తగారికే వదిలేసి నువ్వు నిశ్చింతగా ఉండు. అనవసర విషయాలు నీకెందుకూ?" అని రజితకు చెప్పారు.

అత్తయ్య ఏం మాట్లాడకుండా నిశ్చలంగా ఉన్నారు. చిన్నత్తయ్య మాత్రం మెల్లగా "ఇప్పుడు అన్యాయం ఏం జరిగిందీ... పండు పాలల్లో పడ్డట్టుగా ఉంది గానీ..." గొణుక్కున్నారు.

ముందు రోజు రజితా అన్యాయం జరిగిందన్నట్లుగా మాట్లాడింది. ఇప్పుడు కోదండంగారి అభిప్రాయం అలాగే ఉంది. అన్యాయమేమిటో మరి!

ఈ విషయం కూడా తర్వాతనే నాకు అర్థమైంది!

## 14

ప్రోగ్రాం ప్రకారం విష్ణు సింగపూర్ వెళ్ళారు. అక్కడ నుండి అవసరమైతే చికాగో కూడా వెళ్ళాల్సి ఉంటుంది... ఎన్ని రోజులుండాల్సి వస్తుందనేది తెలియదు.

విష్ణు వెళ్ళిన మర్నాడే కృష్ణప్రసాద్, కోదండంగారు బెంగుళూరు వెళ్ళారు. కోదండంగారికి తెలిసిన వాళ్ళెవరో అక్కడ హాస్పిటల్ బ్రహ్మాండంగా కట్టారట. కోదండం గారు పనిమీద వెళ్తూ కృష్ణప్రసాద్ ఆ హాస్పిటల్ చూడటం ప్రయోజనకరంగా ఉంటుందని అతన్నీ ప్రయాణానికి ఒప్పించారు.

శంకరం వచ్చాడు. వాళ్ళ స్కూలు యానివర్సిరీ ఫంక్షన్ ప్రొగ్రామ్స్‌లో తను స్వామి వివేకానంద ఏకపాత్రాభినయం చేస్తున్నానని మమ్మల్ని రమ్మని పిలిచాడు. నీరజ ఎగ్జామ్స్ ఏవో ఉన్నాయంది. రజిత తనకీ ఏదో పని ఉందని చెప్పింది. శంకరం వెనక నిలబడి 'బాబోయ్ బోర్' అన్నట్లుగా యాక్షన్ చేసింది.

ఈ మధ్య రజిత ప్రవర్తనలో, మాట తీరులో చాలా తేడా కనిపిస్తోంది. అందర్నీ చిన్న చూపుతో విమర్శించటం, చిన్న విషయాలకే కోపం తెచ్చుకోవటం... అవేమీ లేవు. ఎందువలన వచ్చినా గానీ ఆ మార్పు అందరికీ ఆనందంగానే ఉంది!

నేను తప్పకుండా వస్తానని చెప్పాను. నా దగ్గరున్న వివేకానంద ఉపన్యాసాలూ, జీవిత చరిత్ర పుస్తకాలు శంకరం ఒకసారి చూశాడు. వివేకానందుని పట్ల నాకున్న ఆరాధన తెలిసే పిలిచాడని అనుకున్నాను.

ప్రోగ్రామ్ బాగా జరిగింది. వివేకానందలా శంకరం వేషధారణ, ఉపన్యాసమిచ్చిన విధానం అన్నీ చాలా బాగున్నాయి. వివేకానందుని ప్రవచనాలు... భారతదేశం నా బాల్య క్రీడావని... నా యౌవన నందనోద్యాన వనం... నా వార్థక్య వారణాశి... అంటూ

శంకరం చెప్పిన మాటల్ని ఆనందంగా మననం చేసుకుంటూ ఇంటికి వచ్చాను. రాత్రి పదిగంటలయింది. కారు దిగి డ్రైవరును వెళ్ళిపొమ్మని చెప్పాను.

హాలులోకి అడుగు పెట్టబోతూ "ఆగు... ఆగక్కడ.." ఆ గర్జన విని ఉలిక్కిపడ్డాను.

ఎవరలా అరిచింది... ఆలోచిస్తూ... అటూ ఇటూ చూస్తూనే రెండడుగులు వేసేసరికి మళ్ళీ అలాగే "ఆగు..." అనే అరుపు లాంటి కేకకి కొయ్యబారినట్లుగా నిలబడిపోయాను. చేతిలో నుండి జారిపడిన పర్సును తీసుకున్నాను. ఇంట్లో ఏదో అసహజ వాతావరణం.. అర్థం కాలేదు!

హాలులో చివరగా అటు వేపుకి ముఖం పెట్టి ఎవరో కూర్చుని ఉన్నారు. మెడ వరకు జుట్టు... కాషాయరంగు పంచె మాత్రమే కట్టుకున్నారు. ఎవరో ఇద్దరు ఇరుపక్కలా ఉండి నెమలిఈకల విసనకర్రతో మెల్లగా విసురుతున్నారు. అత్తయ్య, చిన్నత్తయ్య అక్కడే నిలబడి ఉన్నారు. రజిత, నీరజ బిక్కమొహాలతో కూర్చుని ఉన్నారు.

ఇంతలో మళ్ళీ ఖంగుమంటూ అదే స్వరం!

"నాకు శాంతి లేదు... అశాంతిగా, ఆవేదనగా శ్రీనిలయం చుట్టూనే పరిభ్రమిస్తున్నాను! అత్తమ్మా... నేనే ఈ ఇంటి పెద్ద కోడలినని శపథం చేశావ్... మర్చిపోయావా..? నేను శ్రీలక్ష్మిని.. నా మరణానికి కారణమైన మనిషి మహారాణిలా శ్రీనిలయంలో తిరుగుతోంటే... నాకెలా శాంతి లభిస్తుంది..? పోవాలి... తక్షణమే వెళ్ళిపోవాలి... అప్పుడే నాకు శాంతి. తెలిసి చేసినా, తెలియక చేసినా పాపం పాపమే... అనుభవించాల్సిందే... ఇప్పటికే అనర్థాలు జరిగాయి... ఆరోగ్యం... ఆనందం.. ఐశ్వర్యం... అన్నీ తరిగిపోతున్నా తెలుసుకోవటం లేదు! నాకు శాంతి లభించకపోతే.. ఇంకా... ఇంకా అనర్థాలు జరుగుతాయి... తక్షణం... తక్షణమే పంపించు..."

అందరూ చలనం లేని బొమ్మల్లా నిలబడి ఉన్నారు. అతనెవరో స్వామీజీ కాబోలు.. ఆ మాటలు ఆపాక లేచి నిలబడి ఇటు వేపుకి తిరిగారు. కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. ఒక క్షణం ఒళ్ళు జలదరించింది.

కళ్ళు మూసుకుని ఒక నిమిషం ఏదో ధ్యానం చేస్తున్నట్లుగా నిలబడి కళ్ళు తెరిచి ఎవరి వేపూ చూడకుండా ధ్యానముద్రలో ఉన్నట్టుగానే అతను వెళ్లిపోతోంటే ఆ ఇద్దరు శిష్యులూ వెంబడించారు.

ఇదంతా ఏమిటో నాకు అంతుబట్టలేదు.

షాక్‌తో బిగుసుకుపోయినట్లుగా నిలబడిపోయిన నా దగ్గరకు వచ్చి మెల్లని స్వరంతో సంగతేమిటో క్లుప్తంగా వివరించింది నీరజ.

“ఇప్పుడు వచ్చింది జోగీంద్ర స్వామీజీ. పెదనాన్న గురువుగారు. ఆయనెక్కడో హిమాలయాల చుట్టుపక్కల, ఇంకా ఏవో ఊళ్ళల్లో సంచరిస్తూ ఉంటారు. ఆయనకు దేశమంతా శిష్యులున్నారు. ఏ శిష్యుడికైనా కష్టం వస్తే ఆయన దృష్టికి తెలిసిపోతుంది. కర్మానుసారం అనుభవించక తప్పని పరిస్థితి అయితే, ఆయన మౌనంగా ఉండిపోతారు! నివారించగలమని తెలిసినప్పుడు పిలిచినట్లే వచ్చి.. ఆ సమస్యల్ని అధిగమించటానికి తగిన సలహాలిచ్చి అంతర్ధానమైనట్లుగా వెళ్ళిపోతారు! చెన్నూరు దగ్గర్లో స్వామీజీకి ఆశ్రమం కూడా ఉంది. అప్పుడప్పుడూ వచ్చి అక్కడ కొద్ది రోజులు ఉంటూంటారు. ఆయనకీ మధ్య... శ్రీనిలయం చుట్టూ అశాంతితో తిరుగుతున్న శ్రీలక్ష్మి ఆత్మ కనిపించిందట! ఏదో చెప్పాలని తపిస్తున్న విషయాన్ని గ్రహించి ఇక్కడకు వచ్చారట. ఏదో పూజ చేశారు. ఈ మధ్యలో జరిగిన చాలా విషయాల్ని కంటితో చూసినట్లుగా చెప్పారు... నువ్వు వచ్చే ముందు శ్రీలక్ష్మి ఆత్మను తనపైకి ఆవాహన చేసుకుంటానని ధ్యానంలో కూర్చున్నారు..”

నీరజ కళ్ళ నుండి నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి.

దిమ్మెరపోయినట్లుగా నిలబడిపోయిన నాలోకి కొంచెం చలనం వచ్చింది. నీరజ మాటలు... మొద్దు బారిపోయినట్లుగా అయిపోయిన మనసులోకి మెల్లగా ప్రవేశించాయి. పరిస్థితి ఏమిటో అర్థం అయింది. ఒక క్షణం అందరి వేపూ చూశాను... అందరి వదనాల్లోనూ.. ఏమౌతుందోననే భయం స్పష్టంగా కనిపించింది.

సోఫాలో కూర్చున్న రజిత ఒక కాలుపైన పెట్టుకొని తల ఆనించి.. వెక్కుతూ మధ్య మధ్యలో నావేపు అదోరకంగా చూస్తోంది!

ఆత్మలనేవి నిజంగా ఉన్నాయా... ఇదంతా నిజమేనా..? మనసులోకి వచ్చిన ఈ ప్రశ్నల్ని నెట్టేసాను. అందరిలోనూ కనిపిస్తోన్న భయాందోళనలు.. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేట్లుగా చేశాయి. తక్షణమే బయటకు పంపించమనే మాట కొరడా దెబ్బలా తగులుతూంటే అవమానంతో మనసు భ... గ్గు... మంది!

పైకి మా గదికి వెళ్ళి నాలుగు నిమిషాల్లోనే నాలుగు జతలు పెట్టుకుని చిన్న సూట్‌కేసుతో తిరిగి హాల్లోకి వచ్చాను. ప్రస్తుతానికి వైజాగ్ వెళ్ళిపోయి... విష్ణు వచ్చాక తర్వాతి సంగతి ఆలోచించవచ్చునుకున్నాను.

నేను బయటకు అడుగులు వేయగానే ముత్యాలు, నీరజ అదేమిటంటూ పరుగున వచ్చారు. నా నిర్ణయం చెప్పాను... నీరజ ఏదో అనబోతుంటే "ఏం మాట్లాడొద్ద"ని గట్టిగానే అన్నాను. అంతలోనే ఇంకొక ఆలోచన వచ్చింది. అంత రాత్రివేళ... ట్రైనేదయినా ఉందో లేదో తెలియకుండా స్టేషనుకి వెళ్ళి కూర్చోవటమెందుకని ఆరాత్రికి.. వెనక్కి ఇంట్లోకి మళ్ళీ అడుగు పెట్టకుండా అవుట్ హౌస్‌లో ఉండి.. ఉదయమే వెళ్ళొచ్చని అనుకున్నాను.

నా చేతిలోని సూట్‌కేసు తీసుకుని ముత్యాలు నాతోపాటు వెనక్కి అవుట్ హౌస్ వేపు వచ్చింది. ఆ రాత్రికి అక్కడే పడుకుంటానని తెలిసి తలుపు తీసి మూలనున్న చీపురుతో గది శుభ్రం చేస్తూ "చిన్నమ్మ... ఆత్మ... అలా సెబుతుందా... ఇద్దూరం కాకపోతే..." ఏదో గొణుక్కుంటోంది.

వరండాలో గోడకి చేరబడి కూర్చున్నాను.

మనసింకా పూర్తిగా విభ్రాంతి నుండి తేరుకోనేలేదు.. ఇదేమిటి ఇలా జరిగింది.. ఇదంతా నిజమేనా, భ్రమ కాదు కదా.... అనే ఆలోచనల్లో ఉండగానే అప్పుడు .. సరిగ్గా అప్పుడు.. ఒక అద్భుతం జరిగింది! నాలోకి ఒక దివ్యశక్తి ప్రవేశించినట్లుగా, నిజంగా అది అ...ద్భు...తమే! అనుకోని విచిత్రమే!!

* ❀ *

తెరిచి ఉంచిన కిటికీ నుండి చొచ్చుకు వచ్చిన బాలభానుని కిరణాల గోరువెచ్చని స్పర్శకి... మెలకువ వచ్చింది. ఆలోచనలో అర్థరాత్రి వరకూ మెలకువగా ఉండటం వలనేమో తొందరగా లేవలేకపోయాను.

బద్ధకంగా కళ్ళు విప్పాను. రాత్రి నా మనసును కలవర పరిచిన అలజడి అలలు మటుమాయమై మనసు చాలా ప్రశాంతంగా ఉంది! ఏ నిమిషానికి ఏం జరుగుతుందో తెలియదు కదా అని మళ్ళీ అనుకున్నాను. ఈ ఇంటికి వచ్చిన కొత్తలో.. ఈ అవుట్ హౌస్ కుటీరంలా ఎంత బావుందో అనుకున్నాను. ఇక్కడే నేను ఓ రాత్రి తలదాచుకోవాల్సి వస్తుందని అప్పుడు ఊహించలేదు మరి! ఎవరైనా .. విధి కల్పించే సంఘటనలకు తలవంచాల్సిందే! ఇలాంటి ఆటుపోట్లు కూడా దృఢచిత్తం అలవడటానికి పనికి వస్తాయి కాబోలు!

ముత్యాల్ని లేపితే... కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుని, "ఇప్పుడేటి సెయ్యాల..?" అంది.

"ఇంట్లోకి వెళ్దాం పద..." అనగానే కళ్ళు పెద్దవి చేసి చూసి "నిజ్జంగానేనా..?" అంది.

అవుననగానే నవ్వు మొహంతో "పదండయితే..." అంది. "ఆ సామి ఏదోసెబితే... మీరెందుకు వినాల. చిన్నమ్మ చల్లని తల్లి.. మిమ్మల్ని పంపించమని సెబుతుందా? నమ్మకండని నేను రాతిరే సెప్పానా..?" హుషారుగా సూట్‌కేసు పట్టుకుంది.

నిజమే.. గది ఊడుస్తున్నంత సేపు రాత్రి ముత్యాలు ఇలా గొణుగుతూనే ఉంది! ఈ మాత్రం తార్కికంగా ఇంట్లో వాళ్ళెవరూ స్పందించలేక పోయారు! ముత్యాలుకైతే... ఆస్తులు.. బంధాలు.. ఏమీ లేవు కాబట్టి... అనర్థాలు జరుగుతాయనే భయం కూడా ఉండకపోవటం సహజమని అంటారేమో...!

"మీరు దరిజాగా ముందేపు నుండే రండి... నేనిటు వస్తా..." అంటూ వంటగది వేపు వెళ్ళింది.

నేను లోపలకు వస్తోంటే... "అమ్మాయ్‌గారొచ్చేశా..రూ.." అని ముత్యాలు పెద్దగా కేక పెట్టింది.

రజిత పరుగులాంటి నడకతో క్రిందకు దిగివచ్చి... ఒక క్షణం నా వేపు విభ్రాంతిగా చూసింది. నేను తిరిగి వస్తానని ఊహించలేదనుకుంటా. కోదండం గారు ఊరు నుండి రాత్రి ఏ వేళప్పుడు వచ్చారో గానీ, ఆయన కూడా లోపలి నుండి వచ్చారు.

"ఏంటి.. రాత్రి అంత ఆవేశంగా వెళ్ళి తెల్లా...రే సరికల్లా తిరిగొచ్చేశావ్...! నేను అనుకుంటూనే ఉన్నాను. తిరిగొస్తావని! అత్తా వాళ్ళే ఏదో జరిగిపోయినట్లు.. నువ్వు నిజంగానే వెళ్ళిపోయావనుకుని ఒకటే బాధ పడిపోయారు! అవున్లే... నీకు మాత్రం ఇలాంటి ఇంటిని వదిలి వెళ్ళాలంటే... కష్టంగానే ఉంటుంది...!" నా వేపు.. ఇంటి వేపు చూపులు తిప్పి వ్యంగ్యంగా అంది రజిత.

"రజితా... నువ్వు... మాట్లాడకు... రాత్రి జరిగింది పొరపాటే!" అప్పుడే వచ్చి నిలబడిన అత్తయ్య అన్నారు.

రజిత తీవ్రంగా "పెద్దత్తా... ఏంటి నీ ఉద్దేశ్యం..? ఎవరెలా పోయినా .. ఏం జరిగినా ఫర్వాలేదనా...? స్వామీజీ చెప్పింది విని కూడా ఇలా అంటున్నావేం?" అడిగింది.

అత్తయ్య స్థిరంగా, నిదానంగా "ఏదో జరుగుతుందని అంటే.. బయట వాళ్ళనైతే పంపిస్తాం గానీ ఇంట్లో వాళ్ళం.. ఎక్కడికి వెళ్తాం..? అది పరిష్కారం కాదు!" అన్నారు.

అత్తయ్య వేపు సంభ్రమంగా చూశాను.

రజిత కోదండంగారి వేపు చూస్తూ చాలా విసురుగా అంది "ఏం అరిష్టం జరిగినా ఫర్వాలేదట! పెద్దత్తకిపుడు సుజన నెత్తిమీద దేవతయిపోయింది!"

"రజితా... ఎందుకలా తొందరపడతావ్...? పెద్దవాళ్ళ విషయాల్లో కల్పించుకోవద్దమ్మా" కోదండంగారు మెత్తగా మందలించారు.

నేను ఎవర్నీ పట్టించుకోకుండా దూరంగా నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్న శాంతమ్మతో "నాకు బాగా ఆకలిగా ఉంది... నేను స్నానం చేసివచ్చేలోగా.. కొంచెం తొందరగా టిఫిన్ రెడీ చేసి పెడతావా?" అన్నాను.

శాంతమ్మ ఆనందంగా తల ఊపి వెళ్ళిపోయింది.

నేనూ గదిలోకి వచ్చేశాను. సూట్‌కేసును నెత్తిమీద పెట్టుకొని ముత్యాలు నా వెనకాలే గెంతుకుంటూ వచ్చింది.

స్నానం చేస్తుంటే చాలా హాయిగా అనిపించింది!

ఆ సమయంలో ఒకసారి నా చిన్నప్పుడు నాన్నమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

రోడ్డు మీద జాతకాలు చెబుతానంటూ కేకలు పెడుతూ వెళ్తున్న కోయదొర లాంటి మనిషిని చూసి పక్కింటావిడ పిలుద్దామని అంటే నాన్నమ్మ వద్దంది. పిలుద్దామని నేనూ సరదా పడ్డాను. అప్పుడు నాన్నమ్మ నచ్చచెప్పింది.

"కొందరు మన విషయాలు ఎలాగో తెలుసుకొని... అవన్నీ తామే చెప్పగలుగుతున్నట్లుగా మనకి చెబుతారు. అన్నీ జరిగినవి... ఏం తేడా లేకుండా ఎంత బాగా చెప్పగలిగాడో అని మనకు అతని మీద గురి కుదురుతుంది. తర్వాత ఏవో నాలుగు మంచి మాటలు చెప్పి.. ఇక మనకు సంక్రమించాల్సిన సిరిసంపదలకు ఏదో శక్తి అడ్డం వస్తుందనో, ఇంకేదో అనో చెప్పి నివారణకి పూజలంటాడు! మన నమ్మకాన్ని డబ్బు చేసుకుంటాడు! మనం చేయకపోతే... ఆ తర్వాత కాకతాళీయంగా ఏం జరిగినా.. ఆ కోయదొర చెప్పనే చెప్పాడు... మనమే వినలేదు...' అని లేనిపోని భయాలతో సతమతమవుతాం! అందుకని కొందరేమో ఎందుకొచ్చిందనుకుంటూ అతను చెప్పిన పూజలకి, అతనికివ్వాల్సిన దక్షిణలకీ వెరవకుండా సిద్ధపడిపోతారు.. మనసులో గట్టి నమ్మకం లేకపోయినా సరే! ముందే మనం వాళ్ళని పిలవకుండా ఉంటే ఏ బెడదా ఉండదు!"

నాన్నమ్మ మాటల్లో ఎంత నిజం ఉందీ...! సరదాకని పిలిచి సంకటం తెచ్చుకున్నట్లవుతుంది!

రాత్రి అందరి మొహాల్లోనూ భయాన్ని చూసే... తర్వాత ఏం జరిగినా స్వామీజీ మాటల వినకపోయామే అనే ఆందోళనకు... నేను కారణం అవటం ఇష్టం లేకనే బయటకు వచ్చేశాను. ఆవేశంగా వెళ్ళిపోయి... శ్రీనిలయాన్ని వదులుకోలేక ఆలోచించుకుని మళ్లీ వచ్చేశానని రజిత ఆరోపిస్తోంది! నవ్వొచ్చింది...!

దైవ ఘటనలా శ్రీలక్ష్మి నన్ను ఒక అవమానకర పరిస్థితి నుండి తప్పించింది కాబట్టి బ్రతికిపోయాను!

నేను డైనింగ్ హాలు దగ్గరకు రాగానే శాంతమ్మ క్షణం కూడా ఆలస్యం చేయకుండా వేడి పూరీలు, కూర తీసుకొచ్చి పెట్టింది. అక్కడే అంతా ఉన్నారు. కోదండంగారు ఏదో చెబుతున్నారు.

"నాకు ఒళ్ళంతా వేడిగా ఉంటే.. జ్వరం వచ్చిందనిపించి,... అక్కడ ఇబ్బంది పడటమెందుకని.. ఒక్కణ్ణీ వచ్చేశాను. మనసులో ఏదో కలవరంగా ఉంటే.. ఏదో అనుకున్నాను. ఇప్పుడు తెలుస్తోంది... ఇక్కడ జరుగుతున్న గొడవల వల్లే నాకలా అనిపించిందేమోనని! స్వామీజీ మాటల్ని బావ శిరోధార్యంగా భావిస్తాడు కానీ... నాకు మాత్రం మొదటి నుండీ నమ్మకం లేదు. కానీ..."

కోదండం గారు మాట్లాడుతుంటే మధ్యలో నేను కల్పించుకున్నాను. ఏకదీక్షగా టిఫిన్ తింటున్న దాన్ని తల ఎత్తి ఆయన వేపు చూస్తూ "బాబాయ్ గారూ... మీరు రాత్రి ఉండి ఉంటే నాకు చాలా ధైర్యంగా ఉండేది. స్వామీజీ మాటల్ని నమ్మనవసరం లేదని.. ఒక్కళ్ళు కూడా అనలేదు..." ఫిర్యాదు చేస్తున్నట్లుగా అన్నాను.

ఆయనకేం సమాధానం చెప్పాలో వెంటనే తోచినట్లు లేదు. ఒక నిమిషం నన్నే పరిశీలనగా చూశారు. తర్వాత గట్టిగా నిట్టూర్చారు. "బావతో నేను చాలా సార్లు ఈ స్వామీజీలు... ఈ చాదస్తం ఏమిటని వాదించాను. జరిగిన విషయాలన్నీ తు.చ. తప్పకుండా చెప్పగలిగే మహానుభావుడికి జరగబోయే విషయాలూ తెలుస్తాయి.. నా సమస్యల్ని తెలుసుకుని ప్రత్యక్షమైనట్లుగా వచ్చి తన సలహాలతో స్వామీజీ ఒడ్డున పడేశారంటూ బావ చాలా సార్లు గొప్పగా చెప్పాడు గానీ నాకే నమ్మకం కుదిరింది కాదు..." అని అత్తయ్య వేపు తిరిగారు. "నిన్న జరిగిన విషయం మాత్రం చాలా

విడ్డూరంగా ఉంది మీనాక్షీ... ఇన్నాళ్ళూ నేనే ఆయన విషయంలో తప్పు అభిప్రాయంతో ఉన్నానేమోననిపిస్తోంది. ఎక్కడో ఉన్న స్వామీజీకి శ్రీనిలయం చుట్టూ కారుమేఘంలా కమ్ముకుంటున్న విపత్తు కనిపించటమేమిటీ... ఇక్కడే తిరుగాడుతున్న నా చిట్టితల్లి శ్రీలక్ష్మి ఆత్మ అశాంతితో అలమటిస్తున్న విషయం తెలియట మేమిటీ... చాలా విచిత్రంగా ఉంది! డబ్బు కోసం ఏదో మాయ మాటలు చెబుతారనటానికీ లేదు... ఆయనెప్పుడూ కానుకగా కూడా పైసా తీసుకోలేదు! ఈ మధ్యకాలంలో ఇక్కడ జరిగిన సంగతులన్నీ కూడా కంటితో చూసినట్లు చెప్పారని రజిత అంటోంది. ఏమిటో.. నాకు చాలా ఆందోళనగా ఉంది... నిజంగానే ఉపద్రవం ఏదైనా ముంచుకు వస్తుందా అని...!"

"స్వామీజీ ఇట్టే వచ్చి అట్టే వెళ్ళిపోయారు! మధ్యలో మనల్ని నట్టేట్లో ముంచినట్లుగా భయపెట్టి వెళ్ళిపోయారే గానీ.. ఆత్మశాంతికి పూజలు గట్రా ఏవో ఉంటాయిగా, అవైనా చెప్పలేదు!" చిన్నత్తయ్య నిట్టూరుస్తూ అన్నారు. మనసులో కొంచెం భయంగానే ఉంది కాబోలు.. మాటల్లో వెల్లడైంది.

"చెప్పిన విషయాన్ని వదిలేసి ఇంకా ఏదో చెప్పలేదంటారేం?" రజిత చిరాకు పడింది.

"ఊహూ.. అలాక్కాదు.. కష్టమో, నష్టమో... కుటుంబం ఎదుర్కోవలసిందే!" అత్తయ్య ఎవరివేపూ చూడకుండా చాలా నిదానంగా, నెమ్మదిగా అన్నారు.

అత్తయ్య వేపు నేను చాలా ఇష్టంగా, గౌరవంగా చూశాను.

"చూశావా నాన్నా... నే చెప్పలేదూ.. ఇప్పుడు పెద్దత్తకి కుటుంబం ఏమైనా ఫర్వాలేదు. సుజనే ముఖ్యం! స్వామీజీ మాటలు విన్నాక కూడా..."

రజిత మాట్లాడుతోంటే కోదండంగారు "ఎందుకలా తొందరపడతావూ? పెద్దవాళ్ళ మాటల్లో నువ్వెందుకూ తలదూర్చటం..?" అంటూ కసురుకున్నారు. అత్తయ్యతో "మీనాక్షీ.. పెద్దదానివి కుటుంబం మంచి చెడ్డల గురించి ఆలోచించాల్సిన బాధ్యత నీదే! నాకూ స్వామీజీ మాటల గురించి ... నిజం చెప్పాలంటే ఆందోళనగానే ఉంది! భూత భవిష్యత్ వర్తమానాల్ని చెప్పగలిగిన వ్యక్తి నిజంగా తపస్సంపన్నుడే అయి ఉంటాడు!" అన్నారు.

"నిజమే బాబాయ్‌గారూ.. ఆయన సంపన్నుడే... కానీ తపస్సు విషయంలో మాత్రం కాదు! ఆయన మాటల గురించి ఆందోళన పడాల్సిన పనేం లేదు... మీరు నిశ్చింతగా ఉండండి... స్వామీజీ మాటల్లో నిజం ఆవగింజంతయినా లేదు!"

చిరునవ్వుతో నేను చెప్పిన మాటలకి ఆయన మనసులో భగ్గుమన్నట్లుగా ఉందనే సంగతి ఆయన మొహం చెప్పకనే చెప్పేస్తోంది! నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చేశారు.

"నువ్వూ మా రజితలా చిన్న పిల్లవే..! పిల్లకాకికేం తెలుస్తుంది ఉండేలు దెబ్బ.. అన్నారు" చాలా నిదానంగా అన్నారాయన. 'నువ్వూ రజిత లాంటిదానివే' అని చెప్పటంలో ఉద్దేశ్యం... నన్నూ పెద్దవాళ్ల మాటల్లో కల్పించుకోవద్దని హెచ్చరించటమే అయి ఉంటుంది.

కొన్నాళ్ళుగా రజిత మాట, ప్రవర్తనలో మార్పు వచ్చిందని అనుకున్నాను. కానీ.. అది నిజం కాదనీ తెచ్చిపెట్టుకున్న అలంకారమేనని తెలిసిపోయింది.

పెద్ద గొంతుతో విరుచుకు పడింది. "స్వామీజీ చెప్పింది నీ గురించి కాబట్టి నువ్వు నిజం కాదనే అంటావు గానీ ఎందుకు ఒప్పుకుంటావ్.. ఎవరెలా పోతే నీకేం..? అసలు ఎవరో చెప్పటం ఎందుకూ... మా అక్క చావుకి కారణం నువ్వు కాదూ..."

రజిత మాటలకూ నేనూ తీవ్ర స్వరంతోనే అభ్యంతరం చెప్పాను. "రజితా.. ఆ మాట ఇంకెప్పుడూ అనకు! శ్రీలక్ష్మి ఆత్మ ఇక్కడ తిరుగుతున్న మాట నిజమే గానీ స్వామీజీ ద్వారా చెప్పిన మాటలు మాత్రం పూర్తిగా అసత్యాలే!"

"ఈ విషయం నీకెలా తెలుసూ? కలగన్నావా?" వ్యంగ్యంగా అంది.

"కలగనలేదు... రాత్రి శ్రీలక్ష్మి ఆత్మ నాకు కనిపించి చెప్పింది" అన్నాను.

రజిత తల పైకెత్తి పెద్దగా నవ్వింది.

"ఏమిటీ.. మా అక్క ... నీకు కనిపించి చెప్పిందా..? ఈ ఇంట్లో తన కోసం ప్రాణం పెట్టే వాళ్ళు ఇంతమంది ఉంటే... వాళ్ళెవ్వరికీ కాకుండా... నీకు... నీకు కనిపించిందా? మేం నీకు అంత పిచ్చివాళ్ళలా కనిపిస్తున్నామా..?"

"అవును నాకే కనిపించింది! కారణం కూడా చెప్పింది. తన మరణానికి నేనే కారణమనే నిందతో నాకు అవమానం జరిగింది కాబట్టి నా ద్వారానే అసలు నిజం తెలియాలని అనుకుందట! ఆ పైనా నా జన్మ నక్షత్రాన్ని బట్టి తన ఆత్మ నాకు మాత్రమే కనిపించే అవకాశం ఉందనే చెప్పింది మరి!"

"నష్టజాతకం అనే మాటని చెరిపేసుకోవటానికి ఇదో ఎత్తు వేస్తున్నావా? బావుంది... చాలా బావుంది! నీ జన్మనక్షత్రం గొప్పదని... మా అక్క... నీకు చెప్పిందా? ఇంతకన్నా జోక్ ఉంటుందా?"

"గొప్ప నక్షత్రమని నేను అనలేదు... ఆత్మ కనుపించే అవకాశం ఉందని చెప్పిందన్నాను!"

"ఏదయితేనేం... అర్థం ఒకటేగా..." అని రజిత అంటూండగానే కొంచెం అటు పక్కగా కూర్చున్న నీరజ లేచి నా పక్కన కూర్చుని మెల్లగా "వదినా.. నిజమేనా? శ్రీలక్ష్మి ఆత్మ కనుపించిందా?" అనడిగింది.

"ఏమిటి నీరజా నువ్వూనూ.. ఆత్మలూ, గీత్మలూ ఏం లేవు... అంతా బూటకమే! తనేదో కట్టు కథ చెబుతుంటే నిజమని నమ్ముతున్నావా?" రజిత నీరజని వెక్కిరింపుగా అడిగింది.

"అదేమిటి రజితా... ఆత్మంటే నీకు నమ్మకం లేదా? నిజమా? మరి ...రాత్రి స్వామీజీ మాటలకు భయపడి కన్నీళ్లు కూడా పెట్టుకున్నావ్‌గా?" ఆశ్చర్యాన్ని చూపించాను.

రజిత ఉరుముతున్నట్లుగా చూసింది. "ఆత్మల గురించి నాకేం తెలియదు. మా అక్కకి ఈ ఇంట్లో అన్యాయం జరిగిన మాట నిజమేగా... అందుకు నాకు దుఃఖం కలిగింది. గొప్పవాళ్ళ మాటలకు విలువ ఉంటుంది! నీలాంటి వాళ్ళు కూడా ఏదో గాలివాటంగా చెబితే నిజమేనని ఎవరు నమ్ముతారు? అసలు ఆయనెక్కడ.. నువ్వెక్కడ?" ఈసడింపుగా అంది.

"నేను ఈ ఇంట్లో మనిషిని కాబట్టి నిజమే చెబుతానని నమ్మొచ్చు. ఆ స్వామీజీ ఎవరో ఎక్కడివాడో... ఏం తెలియదు... ఏదో ఉద్దేశ్యంతో ఏదో చెప్పే స్వామీజీలు ఉండొచ్చు! అసలు ఎక్కడో ఏ పనిచేసుకునే మనిషో అయినా వేషం భాష మార్చుకుని స్వామీజీగా అవతారమెత్తినా మనం కనుక్కోలేం కూడా!" అని నీరజతో "శ్రీలక్ష్మి చనిపోయే ముందు రోజున నీతో ఒకపందెం కాసింది... గుర్తుందా?" అన్నాను.

నీరజ ఆలోచిస్తున్నట్లుగా మొహం పెట్టింది.

కోదండంగారు విసురుగా లేచి నిలబడి "మీనాక్షీ... నీ పెద్ద కోడలు కలగందో, కథ చెబుతోందో నాకేం అర్థం కావటం లేదు! స్వామీజీ గురించి నాకు తెలిసింది తక్కువే.. నీకే తెలుసు! ఆయన మాటల గురించి శ్రద్ధ పెట్టి ఆలోచించాల్సింది నువ్వే! భగవంతుడే కాపాడాలి..." అంటూ రెండు చేతులెత్తి పైకి చూస్తూ దండం పెట్టారు. "మన ఊరు ఆచారిగారి మందు పడితేనే గానీ నాకీ ఉష్ణం తగ్గదు... నే వెళ్తున్నాను.." అంటూ చకచకా వెళ్ళిపోయారు.

రజితా వెనకే వెళ్ళింది.

నీరజ నా వేపు చూస్తూ "నాకేం గుర్తు రావటం లేదే?" అంది.

"మరునాడు సూర్యోదయం ఉండదని, ప్రపంచం అంతా నిశ్శబ్దమైపోతుందనీ.. ఏ అలికిడీ, ఆఖరకు పక్షికూత శబ్దమైనా వినబడక నిశ్శబ్దమైపోతుందనీ శ్రీలక్ష్మి అంటే... 'రేపే కలియుగాంతం వస్తుందంటావా?' అని నువ్వు నవ్వావట కదా? అసలు శ్రీలక్ష్మి అవున్నిజం అని పందెం కడితే కాదని నువ్వూ పందెం అన్నావు. తను ఓడిపోతే తన ముత్యాల హారం నీకిస్తానని అందట కదా?"

నీరజ ఉద్వేగంతో చిన్నగా కేక పెట్టేసింది. "అవును వదినా... ఆరోజు ఇద్దరం అలా అనుకున్నాం! ఈ మాట నేనెవరితోనూ అనలేదు... నీకెలా తెలిసిందీ...?"

"చెప్పానుగా.. శ్రీలక్ష్మి ఆత్మ చెప్పింది..." అంటూ చిరునవ్వు నవ్వాను. "తను చనిపోతుంది కాబట్టి.. మర్నాటికి తనకీ ప్రపంచం అంతా చీకటే కదా అనే ఉద్దేశ్యంతో శ్రీలక్ష్మి అలా అందట. పందెమంటే ఎవరో ఒకరే గెలిచే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం మీరిద్దరూ గెలిచినట్లే అయిందట! తను చనిపోయింది కాబట్టి ప్రపంచం చీకటి అవటమూ, నీకు యధాప్రకారమే ఉంది కాబట్టి నువ్వూ గెలిచినట్లే అయిందని చెప్పి తన ముత్యాల హారాన్ని నిన్ను తీసుకోమంది."

"నిజమా...?! ఆశ్చర్యంగా ఉంది...!!" నీరజ చెంపల మీదుగా కన్నీళ్ళు కారిపోయాయి....

"నిజమే.. ఆ ముత్యాల హారం ఉన్న చిన్న ముఖమల్ పర్సుని పేము బుట్టలో పెట్టిందట. దానిని బెడ్ పక్క నుండి తీసి బుక్ షెల్ఫ్‌లో పెట్టేసినందువల్ల మీరెవరూ దానిని చూసుకోలేదని... ఇప్పుడు నాతో చెప్పింది."

చూసి రావటానికి కాబోలు నీరజ చటుక్కున లేచి నిలబడింది.

అందరూ నిర్విణ్ణులై కళ్ళింత చేసుకుని నా వేపే చూస్తున్నారు! మరి నేను చెబుతున్నది సామాన్యమైన సంగతులు కావుగా... ఇంతవరకెప్పుడూ అనుభవంలోకి రాని అద్భుతమే!

శాంతమ్మ గది గుమ్మం దగ్గిర నేలకి అతుక్కుపోయినట్లుగా నిలబడి ఆశ్చర్యంగా చూస్తోంది. అత్తయ్య, చిన్నత్తయ్యల పరిస్థితీ అలాగే ఉంది. రెప్పవేయటం కూడా మర్చిపోయినంత విభ్రాంతిలో ఉన్నారు.

నీరజ క్షణం కూడా ఆలశ్యం చేయకుండా రివ్వున దూసుకుపోతుంటే.. ఆపి "ఆ పేము బుట్టలోనే ఒక క్యాసెట్ కూడా పెట్టిందట. తను లేకపోయినా తన పాటల్ని వింటూండాలని అత్తయ్య కోసం కృష్ణ భజన... మామయ్యగారి కోసం శివస్తోత్రం పాడి.. రికార్డు చేసిందట!" అని చెప్పాను.

అత్తయ్య కళ్ళల్లో ఆశ్చర్యం ఇంకా రెట్టింపయింది! నమ్మాలో... కూడదో.. తెలియని విచిత్రమైన సందిగ్ధావస్థలో ఉన్నారు!

ఆ పరిస్థితి నాకూ కొంచెం ఇబ్బందిగానే ఉంది.

క్రింద కూర్చున్న ముత్యాలు "అమ్మాయ్ గారూ... రాత్రి చిన్నమ్మ వచ్చి మీతో కబుర్లు సెప్పారా... నేనప్పుడు అక్కడే ఉన్నాను గందా... లేపితే రెండుమాటలు అడిగేదాన్ని కాదా.." అంది. అంతలోనే నీరజ పరుగున వచ్చింది.

ముఖమల్ పర్సులోని హారాన్ని తీసి చూస్తూ దాన్ని ఇష్టంగా గుండెలకు హత్తుకుంది. చిన్నత్తయ్య లేచి వచ్చి "ఏమిటమ్మా.. సుజనా.. ఇదంతా నిజమా...?! శ్రీలక్ష్మి ఆత్మ నీకు కనుపించి ఈ విషయం చెప్పిందా...? స్వామీజీ చెప్పినవన్నీ ఒట్టి మాటలేనా..?" అనడిగారు.

మౌనంగా ఉండిపోయాను.

నీరజ క్యాసెట్‌ని అటూ ఇటూ తిప్పి చూస్తూ "శ్రీలక్ష్మికి అప్పుడెప్పుడో పెదనాన్న తీసుకొచ్చిన టేప్ రికార్డర్ ఉందిగా..." అని మళ్ళీ పరిగెత్తింది.

అందరిలోనూ ఒకటే ఉత్కంఠ!

చివరికెలాగో ఆ క్యాసెట్ పెట్టి నీరజ ఆన్ చేసింది.

శ్రీలక్ష్మి కంఠస్వరంతో "శ్యామ సుందరా... మదనమోహనా.." కృష్ణ గీతం మొదలవగానే ఒక్కసారిగా అందరిలోనూ ఒక తృళ్ళింత.. జలదరింపు కలిగాయ్!

శ్రీలక్ష్మి కంఠస్వరం 'తేనె సోన' అనే మాటకి సరితూగేట్టుగా ఉంది!

వెంటనే శివస్తోత్రం మొదలైంది.

అత్తయ్య, చిన్నత్తయ్యల కళ్ళ నిండా నీళ్ళు! ఏదో పారవశ్యం తెరలా చుట్టేయగా నా కళ్ళల్లోకీ నీటి తెర వచ్చింది.

ఇప్పటి వరకూ అందరి మనస్సుల్లోనూ దోబూచులాడుతున్న నమ్మకం, అపనమ్మకాలకి పూర్తిగా తెరపడి నమ్మకం స్థిరపడినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. క్యాసెట్ ఆగిపోయింది.

అత్తయ్య లేచి నా దగ్గరకు వచ్చి నిలబడేసరికి నేనూ ఆశ్చర్యంతో చూస్తూ లేచి నిలబడ్డాను. నా చేయి పట్టుకుని "సుజనా... శ్రీలక్ష్మి నీకు కనుపించటం.. మాట్లాడటం.. వింతగా ఉంది! మళ్ళీ ఇన్నాళ్ళకి శ్రీలు పాట విన్నాను. ఈ ఆనందం నీవల్లనే..." అన్నారు.

అత్తయ్య మాటల్లో ఏదో ఉద్వేగం.. చిరు కంపనా తెలుస్తున్నాయి!

అత్తయ్య మొదటిసారిగా... అంత ఆప్యాయంగా పలుకరించటం... నా సంబరం అంతా ఇంతా కాదు.. మనసు బొంగరమైపోయి ఆనంద నాట్యం చేసేసింది!

"శ్రీలు.. నా శ్రీలు.. ఎక్కడా పాడుతుందీ...?"

మెల్లగా, బలహీనంగా వినిపించిన ఆ మాటలకు అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి తలలు తిప్పి చూశారు.

నిజంగా అద్భుతమే!

మామయ్యగారు గోడపట్టుకుని మెల్లగా అడుగులు వేస్తున్నారు!

"పెదనాన్నా..." అంటూ నీరజా, అత్తయ్యా నాలుగడుగుల్లో వెళ్ళి ఇద్దరూ పట్టుకున్నారు.

ఇన్నాళ్ళూ మామయ్యగారిలో చూపు తప్ప మాట లేదు! ఆ చూపులో కూడా ఎదుటి వాళ్ళ మాటలు అర్థమైనట్లుగా ఏ భావం ఉండేది కాదు! ఎవరైనా ఇద్దరు పట్టుకుని నిలబెడితే తప్ప సొంతంగా లేవలేరు.

ఇప్పుడు ఇన్నాళ్ళకి లేచి నిలబడి అడుగులు వేయటం.. మాట్లాడటం జరిగింది! శ్రీలక్ష్మి మరణంతో షాక్‌కి గురై నిద్రావస్థలోకి వెళ్ళిపోయిన ఆయన మనసుకి ఈ రోజు శ్రీలక్ష్మి పాటతో మెలకువ వచ్చిందా..?!

నీరజ ఫోను చేయటంతో కాసేపటిలోనే హాస్పిటల్ నుండి ఇద్దరు డాక్టర్లు వచ్చారు. మామయ్యగారు ఎప్పటికి యధాస్థితికి వస్తారో... లేదో ఏమీ చెప్పలేమన్న డాక్టర్లు.. ఇప్పుడు తొందరలోనే ఆరోగ్యం కుదుటపడే సూచనలున్నాయని చెప్పారట! కాకపోతే

వెంటనే మునుపటి విషయాలన్నీ గుర్తు చేయవద్దని.. మెల్ల మెల్లగానే తెలియజేయాలని సూచించి మందులేవో మార్చి రాశారు.

ఆ రోజంతా ఇంట్లో హడావుడే! పండుగ వాతావరణమే!

శాంతమ్మ నా చేయి పట్టుకొని "రాత్రంతా ఇలా జరిగిందేమిటని ఏడుస్తూనే ఉన్నాను. తెల్లారేసరికి ఇంత ఆనందం! చిన్నమ్మ.. అవునమ్మా చిన్నమ్మే తిరిగి వచ్చేసినంత సంబరంగా ఉంది... మిమ్మల్ని చూస్తూంటే..." అంది. "మీదీ చిన్నమ్మలా మంచి మనసు కాబట్టే మీకు కనపడ్డారు..." కళ్ళు తుడుచుకుంది.

"శాంతమ్మా, శ్రీలక్ష్మి నీకో విషయం చెప్పమంది. రంగా ఎవరో కన్నడ అమ్మాయిని ఇష్టపడుతున్నానని చెప్పాడటగా! పెళ్ళికి ఏం అభ్యంతరం చెప్పకుండా అంగీకరించమని తన సలహాగా నీకు చెప్పమంది..." అన్నాను.

శాంతమ్మ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "ఏమిటమ్మా... నిజమా...?"

"నిజమే" అన్నాను.

శాంతమ్మ కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు!

"ఆ రోజు... నేనేదో పరధ్యానంగా ఉన్నానని చిన్నమ్మ కారణం అడిగితే రంగా చెప్పిన మాట చెప్పాను. వాడికి... ఆ పెళ్ళి నాకిష్టం లేదని చెప్పలేదుగానీ... 'మన భాష తెలీని అమ్మాయి కోడలైతే, మాటామంతీ ఉండదుగా' అన్నానంతే. ఇదే చిన్నమ్మ గారికీ అప్పుడు చెప్పాను. అది గుర్తు పెట్టుకుని నాతో చెప్పమని.. ఆ తల్లి చెప్పిందా...?!"

నేనేం మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాను.

శాంతమ్మ పెదవుల మీదకు చిరునవ్వు వచ్చింది. "మొన్న రంగా వచ్చినప్పుడు చెప్పాడు. కోడలితో మాటలుండవని సంశయం అక్కర్లేదమ్మా. తెలుగు బాగా నేర్చుకుని, తెలుగులో నీకు ఉత్తరం రాయగలిగిన తర్వాతే మా పెళ్ళి జరుగుతుందని ఆ అమ్మాయి అందని చెప్పాడు."

"నీ పట్ల అంత గౌరవం చూపించే మంచి అమ్మాయి కోడలుగా వస్తే... ఏ సమస్యలూ ఉండవు. రంగా జీవితం సుఖంగా గడిచిపోతుంది!" అన్నాను.

అప్పుడు రజిత చెప్పిన సంబంధం గుర్తుకొచ్చి మనసులోనే నవ్వుకున్నాను.

"అవునమ్మా... నాకు మాత్రం అంతకు మించి ఏం కావాలీ?" అంది.

అపుడే అటుగా వచ్చిన ముత్యాలు "చిన్నమ్మ మళ్ళీ కనిపిస్తే... నాకు సెప్పాల్సిందే.." అంది.

"సరేగానీ... రెండు మాటలు అడగాలన్నావ్.. ఏం అడగాలేమిటి?" అన్నాను.

"మీరే సెప్పండమ్మా చిన్నమ్మ కోసం పాణాలు పెట్టేవోళ్ళింతమంది ఉండగా... ఎవరూ లేనట్టు ..అలా సెయ్యొచ్చా..? కష్టాలు మణుసులకే గందా వస్తాయి... కడుపులో పెట్టుకుని కాపాడుకునే పెద్దమ్మగోరికి సెప్పుకోవాలగానీ పాణాలు తీసుకోవచ్చా... అందరూ ఎంత బెంగెట్టేసుకుంటారని ఆలోచన సెయ్యొద్దా..? ఇదే.. ఈ మాటే గట్టిగా అడేగేయాల!" చేతులూపుతూ ముత్యాలు అన్న మాటలకి నేను విస్తుపోయాను!

పిచ్చమ్మ అంటారు గానీ ఎంత తెలివిగా మాట్లాడుతుందో ఒక్కోసారి!

నిజమే... ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు తమ బాధల గురించే కాకుండా... తమ మరణం కన్నవాళ్ళకీ... అయినవాళ్ళకీ ఎంతటి తీరని దుఃఖాన్ని కలిగిస్తుందో.. ఆలోచించగలిగితే, అలాంటి సాహసాన్ని చేయలేరు!

ఎలాంటి సమస్యలతోనైనా పోరాడాల్సిందే తప్ప జీవితాన్నుండి పారిపోకూడదు! జీవితాన్నే తృణ ప్రాయంగా వదిలేయగలిగినప్పుడు సమస్యలెందుకు భారమవుతాయి? ఇలా ఎందుకు ఆలోచించరు...? ఆలోచించనివ్వని ఆవేశమే ఆత్మహత్యలకు కారణమౌతుందేమో! ఎలాంటి కష్టమైనా ప్రాణం కంటె ఎక్కువ కాదనే దృఢమైన అభిప్రాయాన్ని పిల్లలకు తల్లిదండ్రులే కలిగించాలి!

"స్వామీజీ చెప్పినప్పుడు ఆత్మలేమిటి... అలా చెప్పటమేమిటి ఒట్టిదే... అనిపించిందమ్మా. కానీ ఇప్పుడు మీరూ చిన్నమ్మ ఆత్మతో మాట్లాడానన్నారు కాబట్టి ఆత్మలనేవి నిజమేనని తెలిసింది!" అంది శాంతమ్మ.

ఒకరి మీద మనకున్న ఇష్టం, నమ్మకాన్ని బట్టి అభిప్రాయాలూ మారిపోతాయి కాబోలు!

ముత్యాలు కూడా అంతే... రాత్రి స్వామీజీ మాటలు నిజం కాదని నాతోనే అంది. నేనీపూట చెబుతోంటే నిజమేనని నమ్మింది!

శ్రీలక్ష్మి ఆత్మ కనిపించటమనేది ఇంట్లో ఓ సంచలన వార్త అయింది!

ఆ సంచలానికి నేను కేంద్రబిందువయ్యాను!